క్లుప్తంగా

భగవద్గీత పారాయణంలో కోదాడ వాసికి గోల్డ్ మెడల్



సచ్చితానందస్వామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న స్వప్న

కోదాడరూరల్ : భగవద్గీత పారాయణం పోటీలో కోదాడ పట్టణానికి చెందిన కనమర్లపూడి స్వప్న గోల్డ్ మెడల్ సాధించింది. మైసూర్‌లో శ్రీగణపతి సచ్చితానంద అవధూత దత్త పీఠం ఆధ్వర్యంలో ప్రతి ఏటా భగవద్గీత పారాయణ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో స్వప్న పాల్గొని మొదటి ప్రయత్నంలోనే 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను నిర్విరామంగా పారాయణం చేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో గల దత్త ఆశ్రమంలో సచ్చితానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌తో పాటు సర్టిఫికెట్ అందుకున్నట్లు ఆమె తెలిపారు.

11న కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కోదాడరూరల్ : కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 11 నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారులు మంద వెంకటేశ్వర్లు, మాధవరపు కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌తో పాటు జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్, లేడీ రిప్రజెంటేటివ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నామినేషన్‌ల ప్రక్రియ పూర్తి కాగ బుధవారం ఉపసంహరణ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా పక్రటించి ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

లక్ష్మీపురం వాసికి డాక్టరేట్



జ్యోతిర్మయిరాణి

కోదాడ : పట్టణ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన జ్యోతిర్మయిరాణికి ఉస్మానియా విశ్వవిద్యాలయం గణిత శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ నాగరాజు పర్యవేక్షణలో 'సర్టెన్ పిక్స్ అండ్ కపుల్డ్ పిక్స్ పాయింట్ థీరమ్స్ ఇన్ వేరియస్ టైప్స్ ఆఫ్ మెట్రిక్ స్పేసెస్ విత్ అప్లికేషన్స్'అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు గాను విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందజేసింది. జ్యోతిర్మయిరాణి ప్రస్తుతం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కేఎల్ గ్రూప్ హైదరాబాద్ వారు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై విద్యార్హతలు ఉన్న హుజూర్‌నగర్ పరిసర ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


పోలీస్‌స్టేషన్‌కు వాటర్ ప్యూరీఫయర్ బహూకరణ



వాటర్ ప్యూరీఫయర్ అందజేస్తున్న సుధాకర్‌నాయక్

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు జగ్గుతండా గ్రామానికి చెందిన బాణోతు సుధాకర్‌నాయక్ తన తండ్రి సైదానాయక్ జ్ఞాపకార్థం రూ.10 వేల విలువ గల వాటర్ ప్యూరీఫయర్ ను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను ఎస్ఐ.పరమేష్ అభినందించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, సిబ్బంది రామకృష్ణ, గోపి, కృష్ణవేణి, యువజన కాంగ్రెస్ మండల నాయకుడు అంగోతు వంశీ నాయక్, రామారావు, చిన్న సైదా, రామ, సాయికుమార్, బాలాజీ పాల్గొన్నారు.

11 నుంచి ధ్యానం, యోగాపై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న వరప్రసాద్

హుజూర్‌నగర్ : ధ్యానోత్సవంలో భాగంగా హుజూర్‌నగర్‌లోని వాసవిభవన్‌లో ఈనెల 11, 12, 13 తేదీల్లో ధ్యానం, యోగాపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హార్ట్ ఫుల్ నెస్ సెంటర్ జోనల్ కోఆర్డినేటర్ సీహెచ్.వరప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ రామారావు తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని బృందావనం గృహంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ సభ్యులు బీసీఎహెచ్ వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మహేంద్ర, రామాంజిరెడ్డి, రామకృష్ణ, యోగి, మాజీ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరావు, గుండా కాంతయ్య, పిన్నని కోటేశ్వరరావు, ప్రభావతి, శ్రీదేవి, విజయశ్రీ, కనకదుర్గ, పద్మావతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం పేదలకు వరం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



చిలుకూరు : లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



నడిగూడెం : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

చిలుకూరు : సన్నబియ్యం పథకం పేదలకు వరం అని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మంగళవారం చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో గల రేషన్ దుకాణంలో సన్నబియ్యాన్ని ఆమె పరిశీలించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, ఆర్ఐ మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, గ్రామ కార్యదర్శి రెడ్డిపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీలర్లు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు

నడిగూడెం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి తెలిపారు. నడిగూడెం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. పైలెట్ గ్రామంగా ఎంపికైన కాగితరామచంద్రాపురంనకు 265 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో 127 ఇళ్లు నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు లక్ష రూపాయలు వారి ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ, తహసీల్దార్ వి.సరిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోదాడ : బాధితులు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి కోరారు. మంగళవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 296 మంది బాధితులకు కోటి ఆరు లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆమె అందజేసి మాట్లాడారు.

ఆర్టీసీ అధికారులతో సమీక్ష..

కోదాడ బస్టాండ్ అభివృద్ధిపై మంగళవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే పద్మావతి సమీక్ష నిర్వహించారు. బస్టాండ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



బరాఖత్‌గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మునగాల: ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో మునగాల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 286 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు 212, సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు 74 ఉన్నట్లు వివరించారు. జిల్లాలో ఐకేపీ ద్వారా 137, పీఏసీఎస్‌ల ద్వారా 127, మెప్మా 12, ఎఫ్‌పీఓ ద్వారా 10 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఏడీఏ ఎల్లయ్య, ఏఓ బుంగా రాజు, ఏఈఓ రేష్మా, పంచాయతీ కార్యదర్శి దేవరం శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, డైరెక్టర్లు బసవయ్య, సిబ్బంది సుందర్, ఎల్లయ్య, శారద పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

నడిగూడెం : ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ దాసరి సంజీవయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కొరట్ల వెంకటేశ్వర్లు, దార అంబేద్కర్, పద్మ, సుధాకర్, జంపాల వెంకన్న, సులోచన, సీతారాం రెడ్డి, స్వరూప, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

మఠంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుంటే ఈనెల 19 నుంచి సమ్మెకు దిగుతామని మంగళవారం మఠంపల్లి ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి 15 మాసాలు గడిచినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంఘం నాయకులు సయ్యద్‌రసూల్‌మియా, భూక్యా సైదా, ఇంటి రవి, మైసయ్య, దేవదానం, అంజయ్య, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా



కోదాడ : ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



హుజూర్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోదాడలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో గ్యాస్ ధర పెంచడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మిట్టగడుపుల ముత్యాలు, దాసరి శ్రీనివాస్, కలకండ గురవయ్య, యాదగిరి, గోవిందకృష్ణ, ఆర్.విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపు ఉపసంహరించుకోవాలి

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సిలెండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంచడం.. ప్రజలపై భారం మోపడమేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గి బ్రహ్మం, శీలం శ్రీను, ఎలక సోమయ్య, వెంకటనారాయణ, యోనా, వీరమల్లు, వీరయ్య, వెంకన్న, నాగమణి, వీరబాబు, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గించాలి

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ డిమాండ్ చేశారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో పేద ప్రజలపై భారం పడుతుందని తెలిపారు. ధరలు తగ్గించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో న్యాయవాదిపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి పాల్పడటాన్ని ఖండిస్తూ మంగళవారం హుజూర్‌నగర్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ముజ్జబాఅలీపై దుండగుల దాడిని తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ తీర్మాన ప్రతులను రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాంశ్రీ, సీనియర్ సివిల్ జడ్జి జిట్ట శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీకు అందజేసి తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, కె.బాలకృష్ణ, సీహెచ్.కృష్ణయ్య, వీజీకే మూర్తి, కె.నాగార్జున, కె.సురేష్, పి.శ్రీనివాసరావు, జె.సంధ్య, టి.శ్రీలక్ష్మి, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎం.అంజయ్య, వి.యాదగిరి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3.8 లక్షలు విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు మోదాల వెంకటసైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మచ్చ శ్రీను, సైదిరెడ్డి, కుర్రి శ్రీఉష, నన్నెపంగ శ్రీను, శ్రీనివాస్, గాంధీ తదితరులు ఉన్నారు.

బూరుగడ్డ జెడ్పీహెచ్‌ఎస్‌లో తప్పిన ప్రమాదం

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెత్తకు నిప్పుపెట్టడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో ఒంటిపూట బడి పూర్తయిన తర్వాత పాఠశాల ఆవరణలో ప్రహరీ వెంట ఉన్న చెత్తకు కొందరు వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు తరగతి గదుల వరకు వచ్చాయి. గ్రామస్తులు గమనించి నీళ్లు చల్లడంతో మంటలు ఆరిపోయాయి. దీంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

సన్న బియ్యం పంపిణీతో పేదలకు మేలు

కోదాడరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిబండలో సన్నబియ్యం లబ్ధిదారుడు ఇరుమాళ్ల రవి ఇంట్లో ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యంతో కుటుంబసభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి, రాజారావు, శ్రీను, ప్రసాద్, ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

కోదాడరూరల్ : వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ హెచ్చరించారు. మంగళవారం కోదాడ పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గల కార్ ట్యాక్సీ డ్రైవర్స్, యజమానులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. అతివేగంగా, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సరిగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కారుల్లో గంజాయి, మాదక ద్రవ్యాలు తరలించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, కారు డ్రైవర్లు, యజమానులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



చిరు వ్యాపారులను సన్మానిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి అన్నారు. నేరేడుచర్లలో చిరు వ్యాపారం చేస్తున్న మహిళలు శారదమ్మ, చిట్టిపోలు లలిత, బొంతల లక్ష్మి, అంజమ్మ, సెల్వి, నాగమణి, అనంత లక్ష్మిను అంతర్జాతీయ మహిళా దినోత్సవ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నేరేడుచర్లలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వనిత క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. అదేవిధంగా 12 ఏళ్ల వాసవి, వనిత క్లబ్‌లలో పదవి బాధ్యతలు చేపట్టి సేవలందిస్తున్న రాచకొండ విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ పీఆర్‌ఓ గరిణె అరుణకుమారి, జిల్లా ఇన్‌చార్జ్‌లు వీరవల్లి శ్రీలత, గెల్లి లక్ష్మిప్రసన్న, కందిబండ శ్రీనివాస్‌రావు, కొత్త లక్ష్మణ్, గరిణె జ్యోతి, చెరుకు కవిత, నర్మద, సంధ్య, శోభ, రజని, నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- దివ్యాంగుల సంస్థ చైర్మన్ వీరయ్య



నేరేడుచర్ల : వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముత్తినేని వీరయ్య



మఠంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మంగా

నేరేడుచర్ల : రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఒక వైపు రైతుల రుణ మాఫీ, మరో వైపు రైతు భరోసా ద్వారా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన వెంకట్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, సోమప్ప దేవాలయం చైర్మన్ సత్యనారాయణ, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, ఏఓ జావిద్, ఏపీఎం శేఖర్, పీఏసీఎస్ సీఈఓ శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.హిమబిందు అన్నారు. మంగళవారం అనంతగిరి, కొత్త గోల్‌తండా, అమీనాబాద్, త్రిపురవరం, శాంతినగర్ తండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300 ధరతో పాటు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, కొండపల్లి వాసు, బాణోతు బాబు నాయక్, గుర్రం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ చందూరి వెంకటేశ్వరరావు, డేగ కొండయ్య, ఈదుల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గరిడేపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కవిత అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్, ఏఈఓ త్రివేణి, సర్వారం సహకార సంఘం కార్యదర్శి తవిడబోయిన గోపయ్య, సంఘం సిబ్బంది ఎడవెల్లి వెంకటేశ్వర్లు, ఉల్లెందుల సతీష్, సందీప్, రైతు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మోతె : మోతె మండల వ్యాప్తంగా బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించనున్నట్లు ఏపీఎం వెంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతె, హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెం, విభళాపురం, కొత్తగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీఓఏలు, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, కమిటీ సభ్యులు కేంద్రాల వద్ద ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

మఠంపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని, అక్కడే ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలని తహసీల్దార్ మంగా రైతులను కోరారు. మంగళవారం మఠంపల్లిలోని ప్రధాన రహదారి పక్కన పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2300 ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు రామచంద్రయ్య, బాబునాయక్, ఏఓ శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కోదాడరూరల్ : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ మండలంలోని గణపవరంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పాలెం రజిని, ఏఈఓ ఝాన్సీ, సింగారెడ్డి సుమన్‌రెడ్డి, పాపిశెట్టి సత్యం, కొండా నర్సింహారావు, గోపిరెడ్డి, కాసాని సత్యం తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అమరవరం పీఏసీఎస్ చైర్మన్ అన్నెం శౌరిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమరవరంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేమ శాతం 17కు తక్కువ ఉండేలా, తాలు లేకుండా ధాన్యం తేవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ గురువారెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



కోదాడరూరల్ : గణపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



హుజూర్‌నగర్‌రూరల్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శౌరిరెడ్డి



గరిడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ బండ కవిత

సత్రం అభివృద్ధికి సహకరించాలి

హుజూర్‌నగర్ : మట్టపల్లి రజక సత్రం అభివృద్ధికి కులస్తులు సహకరించాలని కమిటీ అధ్యక్షుడు పిల్లుట్ల కృష్ణయ్య కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో సత్రం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో జరిగే మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా సత్రంలో అన్నదానం నిర్వహణ, సత్రం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. కమిటీకి సంబంధం లేని వ్యక్తులు అన్నదానం పేరులో చందాలంటూ వసూళ్లకు పాల్పడుతున్న విషయం కమిటీ దృష్టికి వచ్చిందని, ఆ వ్యక్తులకు డబ్బులు ఇవ్వవద్దన్నారు. నాయకులు సట్టు నాగేశ్వరావు, రేపాకుల కోటయ్య, గురువర్య, కోటయ్య, రంగా, సునీత, కళమ్మ, జయమ్మ, శ్రీనివాస్, నాగయ్య, శ్రీను, నాగలింగం, అంజయ్య, ఎల్లయ్య, రమణయ్య పాల్గొన్నారు.

అశ్లీల వీడియోలు షేర్ చేసిన వ్యక్తి రిమాండ్

హుజూర్‌నగర్: బాలల అశ్లీల వీడియోలు చూసి ఇతర గ్రూప్‌లకు షేర్ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్క్ చౌరస్తాకు చెందిన కాల్వ శ్రీనివాసరావు సెల్‌ఫోన్‌కు బానిసయ్యాడు. ప్లే స్టోర్ నుంచి మెస్సెంజర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఆ యాప్‌లో అశ్లీల వీడియోలు చూస్తున్నాడు. 2022 సెప్టెంబర్‌లో బాలల అశ్లీల వీడియో చూడడమేగాక మెస్సెంజర్ యాప్‌లో ఉన్న ఇతర గ్రూప్‌లకు షేర్ చేయడంతో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ అధికారులు గమనించి ఇటీవల హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు పంపారు. దీంతో ఎస్ఐ ముత్తయ్య కేసు నమోదు చేసి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారించడంతో అతను తప్పు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్, సిమ్ కార్డ్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. బాలల అశ్లీల చిత్రాలను చూసినా, గూగుల్‌లో వెతికినా, షేర్ చేసినా నేరమని సీఐ చరమంద రాజు, ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

తిరుకల్యాణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈఓ, నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుకల్యాణ వాల్ పోస్టర్‌ను ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ లక్ష్మణరావుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 12వ తేదీన స్వామివారి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ఎన్‌డీసీఎంసీ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు



ఆచార్యులగూడెంలో రోడ్డు వెంట నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి



ఆర్లెగూడెంలో..

- నీటికోసం అల్లాడుతున్న మూగజీవాలు
- మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతుల వేడుకోలు

చిలుకూరు : వేసవి కాలంలో పశువులు, మేకలు, గొర్రెల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన తాగు నీటి తొట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. దీంతో నీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో నీటి తొట్లను నిర్మించారు. చిలుకూరు మండలంలో గ్రామానికి ఒకటి, రెండు నీటి తొట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో రూ.50 వేలు, మేజర్ గ్రామాల్లో రూ. లక్ష వెచ్చించి నీటి తొట్లను నిర్మించారు. ప్రస్తుతం ఆ నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. కొన్ని తొట్లలో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తా చెదారంతో నిండాయి. మండలంలో సుమారు 20 నీటి తొట్లు ఉన్నా ఒక్కటి కూడా వినియోగంలో లేదు. సంబంధిత అధికారులు స్పందించి నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టి, శుభ్రం చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకొస్తాం



నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొస్తాం. వేసవి కాలంలో నీటి తొట్లలో నిత్యం నీళ్లు ఉండేలా చూసి పశువుల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తాం. అవసరమైతే గ్రామ శివారుల్లో నీటి మరికొన్ని నీటి తొట్లు ఏర్పాటు చేస్తాం.

– గిరిబాబు, ఎంపీడీఓ, చిలుకూరు